RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 230 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 05-12-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

వాదులాట పెరుగు వాదించుకొన్నచో
చర్చచేసుకొనిన సద్దుమణుగు
కలిసియున్నతోడ కలుగుసుఖమెపుడు
విజయలక్ష్మి వాక్కు వినుర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# భారత్ చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

## ఘనంగా స్వాగతం పలికిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**


రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. దిల్లీ సమీపంలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దిగిన ఆయనకు ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ఇద్దరు నేతలు ఒకే కారులో ప్రధాని అధికారిక నివాసానికి ప్రయాణమయ్యారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా రెండు రోజుల పాటు ఇండియా పర్యటనకు వచ్చారు. ప్రధాని నరేంద్రమోడీ ఆయనను స్వయంగా ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతించారు. పుతిన్ 23వ ఇండియా-రష్యా శిఖరాగ్ర

-మిగతా 2 లో

**ఇరువురు నేతలు కలసి ప్రధాని నివాసానికి చేరిక**

**నేడు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు**







## సుప్రీంలో రాహుల్ గాంధీకి ఊరట

- భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసు
- ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేసిన సుప్రీం

**న్యూఢిల్లీ**

భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఉపశమనం లభించింది. రాహుల్‌గాంధీపై ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులను 2026, ఏప్రిల్ 22 వరకు పొడిగించింది. రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ సతీష్ చంద్రలతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఈ అంశాన్ని వివరంగా విచారిస్తామని తెలిపింది. 2022లో చేపట్టిన భారత్ జోడోయాత్రలో రాహుల్‌గాంధీ భారత సైన్యంపై అవమానకరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై ఫిర్యాదుదారు ఉదరు శంకర్ శ్రీవాస్తవ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ట్రయల్ కోర్టు సమన్లు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను అలహాబాద్

-మిగతా 2 లో

# ఆదిలాబాద్‌కు వరాల జల్లు

## ఎయిర్‌పోర్టు నిర్మించి..పరిశ్రమలు రప్పిస్తాం

- యూనివర్సిటీ ఏర్పాటుకు తక్షణ హామీ
- సిమెంట్ పరిశ్రమను తెరిపించి యువతకు ఉద్యోగాలు
- రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన
- ఆదిలాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ వెల్లడి

**ఆదిలాబాద్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఆదిలాబాద్ జిల్లాకు సిఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు ప్రకటించారు. ఎయిర్ పోర్టు, యూనివర్సిటీ, తుమ్మిడిహట్టి ద్వారా నీళ్లు తీసుకొచ్చే బాధ్యత తనదని ప్రకటించారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఏడాదిలోపు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభిస్తామని వ్యాఖ్యానించారు. వరంగల్‌తో పాటు ఆదిలాబాద్‌కు అన్ని రకాల వసతులతో కూడిన ఎయిర్‌పోర్టు ఉండాల్సిందేనని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు వస్తే ఆదిలాబాద్‌కు పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు సీఎం రేవంత్‌రెడ్డి.

-మిగతా 2 లో





## హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ భారీ భూ కుంభకోణం

- పారిశ్రామికవేత్తలకు భూములుకట్టబెట్టే కుట్రలు
- బీఆర్ఎస్ రాగానే ఈ పాలసీని రద్దు చేస్తాం
- ఎవరైనా పెట్టుబడి పెడితే నష్టపోక తప్పదు
- జీడిమెట్ల పారిశ్రామిక కారిడార్‌ను సందర్శించన కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నది బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్‌ఆరోపించారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు రేవంత్ సర్కార్ ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తామని, అవసరమైతే దీనికోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయనే

-మిగతా 2 లో



## చురుకుగా జైషే ఉగ్రవాద కూటమి

- జోరుగా మహిళల రిక్రూట్‌మెంట్
- జైషే మహిళా వింగ్‌లో పెరిగిన నియామకాల సంఖ్య..
- రూ.500తో 40 నిమిషాల ఆన్‌లైన్ శిక్షణ

**ఇస్లామాబాద్,**

పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే తన కార్యకలాపాలను విస్తరించేందుకు మహిళలతో ఏర్పాటు చేసిన ఉగ్రవాద గ్రూప్ చురుకుగా పనిచేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దీనికి మహిళల నుంచి మంచి స్పందన వస్తోందని ఆ సంస్థ ప్రకటించుకుంది. మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ మహిళా గ్రూపుకు నేతృత్వం వహిస్తున్నారు. 'జమాతుల్-ముమినాత్'పేరుతో ఓ ప్రత్యేక యూనిట్‌ను తయారు చేస్తున్నది. అయితే, కొద్ది వారాల వ్యవధిలోనే వేల సంఖ్యలో మహిళల్ని ఆకర్షించి నట్లు తేలింది. ఈ విషయాన్ని స్వయంగా మసూద్ అజారే సోషల్ మీడియా వేదికగా వెల్లడించడం గమనార్హం. ఉగ్రవాద సంస్థ మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోందని

-మిగతా 2 లో



## రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని శాసించనున్న ఏఐ

- 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమీకి ప్లాన్
- వేయికోట్ల రూపాయలతో స్టార్టప్ లను ప్రోత్సహిస్తాం
- క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్
- నీతి ఆయోగ్ క్వాంటం సదస్సులో భట్టి, శ్రీధర్ బాబు

**హైదరాబాద్,డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ప్రపంచాన్ని శాసిస్తుందని డిప్యూటీ సీఎం విక్రమార్క పేర్కొన్నారు. అయితే, తెలంగాణ 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమీకి చేరుకోవాలని ప్లాన్ చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన క్వాంటం పవర్డ్ ఎకానమీ స్ట్రాటజీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. క్వాంటం టెక్నాలజీ గురించి దేశం చర్చిస్తుంది.. దాని ఆవిష్కరణకి తెలంగాణను ఎంచుకున్నందుకు నీతి ఆయోగ్ కి ధన్యవాదాలు చెప్పుకొచ్చారు. డిజిటల్, టాలెంట్ కి

-మిగతా 2 లో

## భారత్ రూపాయి మరింతగా పతనం

- అంతర్జాతీయ పరిణామాల ప్రభావం
- రూ.90.36 వద్ద ప్రారంభమై, 90.43కు చేరిక



**ముంబై, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

భారతదేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో రూపాయి మరింతగా పతనం అయ్యింది. తాజాగా గురువారం ఉదయం డాలర్‌తో పోలిస్తే 28 పైసలు తగ్గి, ఆల్ టైమ్ కనిష్ట స్థాయి 90.43కి చేరింది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో రూ.90.36 వద్ద ప్రారంభమై, కనిష్ట స్థాయి 90.43ని తాకింది. రూపాయి పడిపోవడం దిగుమతులను మరింత ఖరీదైనదిగా మారనున్నది. ఇది దేశంలో ధరల పెరుగుదలకు దారితీస్తుందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు.

-మిగతా 2 లో

## పంచాయితీ రిజర్వేషన్లపై జోక్యం చేసుకోం

- పిటిషన్లపై విచారణలో హైకోర్టు స్పష్టీకరణ



**హైదరాబాద్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. చట్టప్రకారం ఎన్నికల పక్రియలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌ల వ్యవహారంలో దాఖలైన ఆరు పిటిషన్‌లపై విచారించిన

-మిగతా 2 లో

## గుర్తింపు కోసం నేను పనిచేయను

- ప్రజల కోసం మాత్రమే పనిచేస్తా.
- నాకు పదవి అలంకరణ కాదు.. ఓ బాధ్యత
- ప్రజలకు సేవలందించడానికి డీడీవో ఆఫీసులు
- చిత్తూరు పర్యటనలో డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్

**చిత్తూరు డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గుర్తింపు కోసం నేను పనిచేయను.. ప్రజల కోసం మాత్రమే పనిచేస్తా. నాకు పదవి అలంకరణ కాదు.. ఓ బాధ్యత అని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే గ్రామీణాభివృద్ధిశాఖ పని అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. చిత్తూరులో డివిజనల్ అభివృద్ధి అధికారి డీడీవో కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అదే కార్యక్రమంలో వివిధ జిల్లాల్లోని

-మిగతా 2 లో



## భారత్ చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్



మొదటి తరువాయి

సమావేశంలో పాల్గొననున్నారు. రెండు దేశాల మధ్య రక్షణ, వాణిజ్య రంగాలలో పలు కీలక ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభానికి కొన్ని నెలల ముందు 2021 డిసెంబరులో పుతిన్ చివరిసారి దిల్లీలో పర్యటించారు. ఆ తర్వాత ఆయన మన దేశానికి రావడం ఇదే తొలిసారి. రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు అమలు చేస్తున్న వేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పుతిన్ కు ప్రధాని మోదీ ప్రైవేటు విందు ఇవ్వనున్నట్లు సమాచారం. శుక్రవారం ఇరునేతలు ఇండియా-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పలు రక్షణ, వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. భారత్‌తో సంబంధాలు, సహకారాన్ని మరింత పెంపొందించుకోవడానికి రష్యా ఎదురు చూస్తోందని పుతిన్ ఇప్పటికే తెలిపారు. ఇంధనం, పరిశ్రమలు, అంతరిక్షం తదితర రంగాల్లో అనేక ఉమ్మడి ప్రాజెక్టులు పూర్తి చేసుకోవడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భారత్ నుంచి దిగుమతులు మరింత పెంచుకునే అంశంపైనా చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు. గురువారం వ్లాదిమిర్ పుతిన్ పాలం వైమానిక దళ స్టేషన్‌లో దిగగా ప్రధాని మోదీ ఆయనకు స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 11.00: పుతిన్ రాష్ట్రపతిని కలిసేందుకు రాష్ట్రపతి భవన్‌కు వెళతారు. ఉదయం 11.30కు రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పిస్తారు.ఉదయం 11.50: నరేంద్ర మోదీతో సమావేశం.మధ్యాహ్నం 1.50: హైదరాబాద్ హౌస్‌లో సంయుక్త విలేకరుల సమావేశం ఉంటుంది. సాయంత్రం 7.00 గంటలు: పుతిన్ రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశం అవుతారు.రాత్రి 9.00 గంటలకుఆయన తన పర్యటనను ముగించుకుని భారతదేశం నుండి బయలుదేరుతారు. పుతిన పర్యటన సందర్భంగా ఢిల్లీలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సుప్రీంలో రాహుల్ గాంధీకి ఊరట

మొదటి తరువాయి

హైకోర్టు మే 29న కొట్టివేసింది. దీంతో ఈ ఉత్తర్వులపై రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఆగస్టు 4న రాహుల్ గాంధీ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. తదుపరి విచారణ తేదీ వరకు స్టే విధించింది.

## చురుకుగా జైషే ఉగ్రవాద కూటమి

మొదటి తరువాయి

జైష్ చీఫ్ మసూద్ అజార్ అందులో పేర్కొన్నారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 'జైషే మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోంది. చాలా తక్కువ సమయంలోనే 5,000 మందికిపైగా మహిళలు చేరారు. ఇదంతా అల్లా దయ వల్లే జరిగింది. చాలా మంది సోదరీమణులు నియామకం పొందిన వెంటనే తమ మానస్థిక స్థితిమారిపోయినట్లు చెబుతున్నారు. జీవిత లక్ష్యాన్ని గ్రహించినట్లు చెప్పారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి జిల్లాకు ఒక ముంటాజియా (మేనేజర్) ఉంటారు' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. కాగా, పలు నివేదికల ప్రకారం.. జమాతుల్-ముమినాత్ కోసం నియామక డ్రైవ్ ఈ ఏడాది అక్టోబర్ 8న జైషే ప్రధాన కార్యాలయం మర్కజ్ ఉస్మాన్-ఓ-అలీలో ప్రారంభమైంది. ఈ డ్రైవ్‌లో భాగంగా పాక్‌లోని బహవల్‌పూర్, ముల్తాన్, సియాల్‌కోట్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లి నుంచి మహిళలను ఉగ్రవాద సంస్థలోకి చేర్చుకున్నారు. ఈ సంస్థ రూ.500 ఫీజుతో 40 నిమిషాలు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తూ.. మహిళల్ని ఉగ్రవాదం వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఐఎస్ఐఎస్, హమాస్, ఎల్‌టీటీఈ తరహాలో ఫిదాయిన్ (ఆత్మాహుతి) దాడులు నిర్వహించడానికి ఈ మహిళలతో ఉగ్రవాద బ్రిగేడ్‌లను ఏర్పాటు చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది.

## రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని శాసించనున్న ఏఐ

మొదటి తరువాయి

హైదరాబాద్ కి కేంద్రంగా మారింది అన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా టెక్నాలజీని ప్రమోట్ చేసే పనిలో ఉన్నారు.. నీతి ఆయోగ్ కూడా గ్లోబల్ సమ్మిట్ లో భాగస్వామ్యం కావాలని కోరుతున్నాం.. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అన్ని రంగాల పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం.. యంగ్ ఇండియా స్టార్టప్ కోసం ఫండింగ్ చేయాలని నిర్ణయించాం.. 1000 కోట్ల రూపాయలతో స్టార్టప్ లను ప్రోత్సహిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. 'క్వాంటం సిటీ'గా హైదరాబాద్ ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీని రూపొందించా మన్నారు. గచ్చిబౌలిలోని 'ఐఐటీ హైదరాబాద్'లో 'నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం అండ్ తెలంగాణ క్వాంటం స్ట్రాటజీని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీలో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్‌లో ఆర్అండ్ డీ, ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు.

# ఆదిలాబాద్‌కు వరాల జల్లు

మొదటి తరువాయి

ఎర్రబస్సే కాదని.. ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు కూడా తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. అనంతరం ప్రసంగించారు. ఆదిలాబాద్ అభివృద్ధి బాధ్యత నేనే తీసుకుంటానని చెప్పుకొచ్చారు. ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్‌ను దించి.. పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారు. ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటోంది. సంక్షేమం-అభివృద్ధి రెండుకళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నాం. రెండేళ్లుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నా. చిన్న వయసులోనే నాకు గొప్ప అవకాశం దక్కడం.. ప్రజల దీవెన, దేవుడి సంకల్పం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు విపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా అనుమతించలేదు. ఎమ్మెల్యేలను కూడా సచివాలయంలోకి రాకుండా అడ్డుకున్న ప్రభుత్వాన్ని గత పదేళ్లలో చూశాం. ఏ ఆశయంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో.. గత పదేళ్లలో అది నెరవేరలేదు. రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంటరీ రూపొందించాం. పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం అని అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంద్రవెల్లి స్ఫూర్తిగానే గత ప్రభుత్వంపై నేను పోరాటం ప్రారంభించానని అన్నారు. అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల స్థూపం పర్యాటకంగా అభివృద్ధి చేసే దస్త్రంపై సంతకం పెట్టాను. ఆదిలాబాద్‌కు సాగునీరు అందేలా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును వైఎస్ఆర్ చేపట్టారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. మూడేళ్లకే కాళేశ్వరం కూలింది. ప్రజల సొమ్ము దోచుకుని అక్రమ సొమ్ము కోసం ఇవాళ ఆ కుటుంబంలో గొడవలు పడుతున్నారు. అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్దే నిర్మించి ఆదిలాబాద్‌కు నీరు ఇస్తాం. ఎన్నికల ఉత్సవం పూర్తి కాగానే మరో 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం అని సీఎం హామీ ఇచ్చారు.తుమ్మిడిహట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కట్టితీరుతామని స్పష్టం చేశారు.ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తానే వస్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నాయని వివరించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిని పర్యాటక కేంద్రంగా మారుస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు మళ్లీ వస్తానని.... రోజంతా సమస్యలపై సమీక్షిస్తానని తెలిపారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యూనికేషన్‌లో ఆదిలాబాద్ అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఆదిలాబాద్‌లో తప్పకుండా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ ఎక్కడ కట్టాలో స్థానిక నేతలంతా కలిసి ఒక నిర్ణయానికి రావాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిలో యూనివర్సిటీ కడితే బాగుంటుందని తన భావన అని తెలిపారు. అనుమతి మాత్రమే తనదని.. ఎక్కడ కట్టాలో నిర్ణయం మీదేనని చెప్పుకొచ్చారు. ఏడాదిలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. రాబోయే రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. మన యువత ఐఏఎస్, ఐపీఎస్‌లు అయినప్పుడే తనకు సంతోషమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బాగా చదువుకుని తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటాలన్నారు. సర్పంచ్‌లను చూసి ఎన్నుకోవాలని, పనిచేసే వారికే అవకాశం ఇవ్వాలన్నారు. రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, తదితరులు సభలో పాల్గొన్నారు.

# హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ భారీ భూ కుంభకోణం

మొదటి తరువాయి

విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావని, ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు, ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. అందులో కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇచ్చారని గుర్తుచేశారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తున్నదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో ఇండ్లకు, పాఠశాలలు, దవాఖానలు, చివరికి స్మశానాలకు స్థలం లేదు.. కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ 9300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్తున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూళ్లు, హాస్పిటళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదన్నారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిర్ధారణ జరగాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ఇక్కడితో వదిలిపెట్టదని, కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణంపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలోని కాలనీల ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని చెప్పారు. అనుముల రేవంత్ రెడ్డి కాదని, అవినీతి అనకొండ అని విమర్శించారు. 9300 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసి లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఢిల్లీకి మూటలు పంపడానికి చేస్తున్న ఈ స్కామ్ ను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల విలువచేసే ప్రజల భూమిని కాపాడే దాకా తమ పోరాటంకొనసాగుతుందన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయిందంటూ ప్రభుత్వం బాధపడుతున్నదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీడిమెట్ల ప్రాంతంలో గజానికి మార్కెట్ ధర లక్ష రూపాయలుగా ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కే భూమిని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతున్నదని విమర్శించారు. ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుంభకోణానికి ఇది నిదర్శనమన్నారు. భూముల దోపిడీ ఆర్నెళ్లుగా జరుగుతున్నదని, పాలసీ ఇప్పుడు బయటకు వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవలన్నారు.

## గుర్తింపు కోసం నేను పనిచేయను

మొదటి తరువాయి

77 డీడీవో కార్యాలయాలకు పవన్ వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏపీ వ్యాప్తంగా కొత్త డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పవన్ పాల్గొన్నారు. వర్చువల్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా డీడీవో కార్యాలయాలను ప్రారంభించారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి సంస్కరణలో భాగంగా రాష్ట్రంలో 77 డీడీవో ఆఫీసులను ప్రారంభించాం అని, విస్తృతంగా ప్రజలకు సేవలందించడానికి డీడీవో ఆఫీసులు ఉపయోగపడుతాయన్నారు. సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించడానికి ఈ కార్యాలయాలు ఉపయోగపడతాయి పవన్ కళ్యాణ్ చెప్పారు. కూటమి ప్రభుత్వం కేంద్రానికి బలం అయ్యింది. కార్యకర్తలకు గుర్తింపు కష్టపడితే వస్తుంది. ప్రభుత్వ ఉద్యోగి ఇంటిలో పదోన్నతులపై ఎంతో ఆసక్తి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులనేది చాలా కీలకం. ఉద్యోగుల పాత్ర తెలుసు కాబట్టి పదివేల మంది ఉద్యోగులకు ఒకేసారి పదోన్నతులు కల్పించాం. గోంతు లేని వారికి మనం గోంతు అవ్వాలి, వారికోసం బలంగా నిలబడాలి. జీవితంలో రిస్క్ తీసుకుంటునే విజయం సాధించగలం. అది కూటమి ప్రభుత్వం చేసి చూపించింది. 15 సంవత్సరాల పాటు కూటమి ప్రభుత్వం అధికారికంలో ఉంటుంది. గత ఇరవై సంవత్సరాలలో కోట్లాది రూపాయల ఎర్రచందనం తరలించి సోమ్ము చేసుకున్నారు. 2008 నుండి రాజకీయాల్లో ఉన్నాను.. చంద్రబాబు లాంటి వారిని కుప్పం రాకుండా అడ్డుకున్నారు. ఎప్పుడూ కూడా ధైర్యాన్ని కోల్పోకుడదు.. ప్రజలు అన్నింటిని ధైర్యంగా ఎదుర్కొవాలి. కూర్చుని మాట్లాడుకుంటే అన్ని సమస్యలు తీరుతాయి. జనసేన కార్యకర్తలకు పరిపాలన పరంగా అనుభవం లేకపోవచ్చు కాని సమాజం కోసం కసిగా పనిచేస్తారు. పార్టీ పరంగా ప్రతి నియోజకవర్గంలో ఓ కమిటి ఎర్పాటు చేస్తాం' అని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టానికి ఐటీ వింగ్ ఏర్పాటు చేశాం'అని పవన్ అన్నారు.చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లా పర్యటన నిమిత్తం గురువారం ఉదయం 10.30 గం.లకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఏపీ ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ కు అధికారులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, రైల్వే కోడూరు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు,పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, అరవ శ్రీధర్, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ హరి ప్రసాద్, శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడు, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి, డ్వామా పిడి శ్రీనివాసరావు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, తదితర అధికారులు ప్రజాప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి వర్యులకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. విమానాశ్రయం వెలుపల ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి ఉదయం 10.40 గంటలకు రోడ్డు మార్గాన చిత్తూరు జిల్లాకు బయల్దేరి వెళ్ళారు.

## భారత్ రూపాయి మరింతగా పతనం

మొదటి తరువాయి

రూపాయి విలువ మరింతగా పతనం చెంది 91కి చేరుకుంటుందని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ప్యానెల్ వడ్డీ రేటుపై నిర్ణయాన్ని శుక్రవారం ప్రకటించనున్నారు. అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి పతనం కొనసాగుతూనే ఉంది. భారత్-అమెరికా డీల్‌పై అనిశ్చితులు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాలతో రూపాయి మారకం విలువ నానాటికీ క్షీణిస్తోంది. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక దశలో డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ విలువ ఏకంగా 28 పైసలు పడిపోయి 90.43 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది.క్రితం సెషన్‌లో రూపాయి విలువ 90.15 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఈ క్షీణత మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని, రూపాయి విలువ 90.70-91 మార్క్‌ను తాకనుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొన్ని నెలలుగా భారత ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండ టంతో, డాలర్లకు గిరాకీ పెరిగి రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతోంది. వస్తువులకు చెల్లింపులు చేసేందుకు దిగుమతిదారులు భారీగా డాలర్లను కొనుగోలు చేస్తుండటమూ రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. మరోవైపు, నేటి ట్రేడింగ్‌లో స్టాక్‌మార్కెట్ సూచీలు ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలు శుక్రవారం వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. దీంతో సూచీలు స్తబ్దుగా కదలాడుతున్నాయి. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో సెన్సెక్స్ స్వల్పంగా 33 పాయింట్ల లాభంతో 85,140 వద్ద, నిఫ్టీ 6 పాయింట్ల లాభంతో 25,992 వద్ద ట్రేడ్ అవుతున్నాయి.

## పంచాయితీ రిజర్వేషన్లపై జోక్యం చేసుకోం

మొదటి తరువాయి

హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఎస్సీ, ఎస్టీ జనాభా లేని చోట కూడా ఆయా కులాలకు వార్డుమెంబర్లు, సర్పంచి రిజర్వేషన్లు కేటాయించారన్న పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచి రిజర్వేషన్లు కేటాయించడం వల్ల తప్పులు దొర్లాయని తెలిపారు. రిజర్వేషన్లు కేటాయించిన చోట సంబంధిత కులానికి చెందిన వ్యక్తులు లేకపోతే ఎన్నికల నిర్వహించబోమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. ఎస్ఈసీ వాదనను రికార్డు చేసుకున్న హైకోర్టు.. పిటిషన్లపై విచారణ ముగించింది.

# కాలుష్యం కోరల్లో విలవిలలాడుతున్న ప్రభావిత గ్రామాలు



**పాలకుర్తి, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : బసంతనగర్ అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కారణంగా పాలకుర్తి మండలంలోని పలు గ్రామాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పాలకుర్తి, ఈశాల తక్కల్లపల్లి, రామారావుపల్లి, కొత్తపల్లి గ్రామాలను దత్తతగా తీసుకున్నప్పటికీ కంపెనీ వాగ్దానాలు నిలబెట్టుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్మాగారం నుండి వచ్చే పొగతో గాలి కాలుష్యం పెరిగి ప్రజలు, పశు సంపద, పంటలు నష్టపోతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఫ్యాక్టరీ నుండి వచ్చే కెమికల్ నీరు చెరువుల్లో కలిసిపోవడంతో చేపలు చనిపోతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. సి ఎస్ ఆర్ నిధులు నిలిపివేయడంతో ఉచిత వైద్య శిబిరాలు, పరీక్షలు జరగడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. భూములు ఇచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా స్థానికేతరులకు అవకాశాలు కల్పించడం వల్ల యువత నిరుద్యోగ సమస్యతో పోరాడుతున్నారు. క్వారీల్లో ఓపెన్ బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లకు బీటలు పడి కూలిపోతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. కార్మికులు రాత్రింబవళ్ళు విధులకు వెళ్తున్నా వీధి దీపాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్ట్రాటెక్‌గా మారి ఏడాది గడిచినా యాజమాన్యం ప్రభావిత గ్రామాలను సందర్శించి సమస్యలు తెలుసుకోలేదని ప్రజలు ఆరోపిస్తూ, ఇప్పటికైనా సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరుతున్నారు.

# తెలంగాణ గోశాల సంపర్క్ ప్రముఖ్‌గా ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి



**కరీంనగర్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఊట్కూరి రాధాకృష్ణారెడ్డిని తెలంగాణ ప్రాంత గోశాల సంపర్క్ ప్రముఖ్‌గా నియమించారు. ఈ సమావేశానికి జాతీయ గోరక్ష సహప్రముఖ కేశవ్ జి, క్షేత్ర సంఘటన మంత్రి యాదగిరి రావు, విశ్వహిందూ పరిషత్ సహకార దర్శి రమేష్, గోరక్ష ప్రముఖ ఈసంపల్లి వెంకన్నతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరయ్యారు. రాధాకృష్ణారెడ్డి గత మూడు దశాబ్దాలుగా గోమాత సేవలో తన జీవితాన్ని అంకితం చేశారు. ఉత్తర తెలంగాణలోని ఆరు ఉమ్మడి జిల్లాల్లో వేలాది గోమాతలను కబేళాల నుంచి కాపాడి రైతులకు అందిస్తూ గో సేవను ప్రోత్సహించారు. దేశీయ గోసంతతిని కాపాడి అభివృద్ధి చేయడమే తన ధ్యేయంగా కొనసాగుతున్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి యువగోరక్షకులను ప్రోత్సహిస్తూ వారికి ధైర్యం నింపుతున్నారు. ఆయన కృషి, పట్టుదల భవిష్యత్తులో యువగోరక్షకులకు ఆదర్శంగా నిలుస్తుందని, మరిన్ని గోమాతలను కాపాడి సేవలు కొనసాగించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# నూతన కార్యవర్గం ఎన్నిక



**కరీంనగర్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్** : తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటరినేరియన్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా ననువాల గిరిధర్ రావు, కార్యదర్శిగా జడ కమలాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమానికి జిల్లా పశువైద్య పశుసంవర్ధక అధికారి లింగారెడ్డి, జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు బింగి సురేష్ హాజరై, సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. వినోద్ కుమార్, అభిషేక్ రెడ్డి, సంగెం లక్ష్మణ్ రావు, రాగి శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, హర్మిందర్ సింగ్, కిరణ్, రాజేష్ భరద్వాజ్, చిరంజీవి, భాగ్య, వేణుగోపాల్ రెడ్డి, రఫీయుల్లా, తోట రాజు, విజయలక్ష్మి, బి. రాజు, శ్రీనివాస్, మమత, ప్రణయ్, క్రాంతి, రాము, సత్యలక్ష్మి, రజిత, అనిత, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# సుంకే రవిశంకర్ మీడియా సమావేశం



**కరీంనగర్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల నియమావళి అమలులో ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న విజయోత్సవ సభలను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరారు. జిల్లా కేంద్రంలోని ఒక హోటల్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన, పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ సభలు నిర్వహించడం సిగ్గుచేటు అని విమర్శించారు. హుస్నాబాద్‌లో జరిగిన సభకు గ్రామీణ ప్రజలను, స్కూల్ పిల్లలను తరలించడం ప్రజాధన దుర్వినియోగమని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా విజయోత్సవ సభలు పెట్టడం హాస్యాస్పదమని, 420 హామీలను నెరవేర్చిన తర్వాతే సభలు పెట్టాలని సూచించారు. బిఆర్ఎస్ తరఫున ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తిరుమల్ రావు, విజేందర్ రెడ్డి, తిరుపతి, సత్తినేని శ్రీనివాస్, నవీన్ రావు, చొప్పదండి మండల నాయకులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రాంగణంలో ఎస్.పి. బాలసుబ్రమణ్యం విగ్రహం

**కరీంనగర్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రాంగణంలో ప్రముఖ గాయకుడు ఎస్.పి. బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని డిసెంబర్ 15న స్థాపించనున్నారు. ఈ నిర్ణయంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య సోషల్ మీడియా వేదికగా వాదోపవాదాలు చెలరేగుతున్నాయి. ఉప్పల రామేశం, పొట్టి శ్రీరాములు ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ, 2023లో సెక్రటేరియట్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహం తొలగించినప్పుడు, అలాగే 2025లో తెలుగు యూనివర్సిటీ పేరు మార్చినప్పుడు ఎవరూ స్పందించలేదని, ఇప్పుడు మాత్రం విగ్రహ స్థాపనపై వాదనలు మొదలయ్యాయని వ్యాఖ్యానించారు.

# సీఎం శంకుస్థాపన పనులపై వొడితల సతీష్ విమర్శలు



**హుస్నాబాద్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్‌లో సీఎం పర్యటనతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ వ్యాఖ్యానించారు. సీఎం శంకుస్థాపన చేసిన పనులను ఆరు నెలల్లో పూర్తి చేసే దమ్ముందా అని ఆయన ప్రశ్నించారు. గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నప్పటికీ, బిఆర్ఎస్ పాలనలో 96 శాతం పనులు పూర్తి చేసి నీటిని నింపిన ఘనత తమదేనని తెలిపారు. కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. గండిపల్లి రిజర్వాయర్ పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఆ విషయాన్ని ప్రస్తావించలేదని అన్నారు. హుస్నాబాద్ పట్టణానికి జాతీయ అవార్డులు రావడం అభివృద్ధి ఫలితమేనని, చిన్న నీటి వనరులు, చెరువుల మరమ్మత్తులు, శనిగరం ప్రాజెక్టు వంటి పనులు బిఆర్ఎస్ పాలనలో జరిగాయని గుర్తుచేశారు. ప్రజలకు సేవలందించడమే తమ ధ్యేయమని, కమిషన్ల కోసం పనిచేయలేదని పేర్కొన్నారు. సీఎం శంకుస్థాపన చేసిన పనులను పూర్తి చేసి చూపితేనే ప్రజలు నమ్ముతారని, సభలు పెట్టి ఊకదంపుడు మాటలు చెప్పడం వల్ల ప్రయోజనం లేదని అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే సీఎం పర్యటనలు, సభలు జరుగుతున్నాయని, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజాసేవా దృక్పథంతో పనిచేయాలని సతీష్ హితవు పలికారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన




**వరంగల్ , డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రతి డివిజన్‌లో పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ రోజు 4వ డివిజన్ అక్షర కాలనీ, యాదవ నగర్ మరియు 9వ డివిజన్ గణేష్ నగర్‌లలో రూ. 1.20 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైన్లు, పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజలతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించినందుకు ప్రజలు ఎమ్మెల్యేను సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలతో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరవుతున్నాయని, పనులు త్వరితగతిన పూర్తిచేయడానికి అధికార యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. ఇటీవల కౌన్సిల్‌లో రూ. 30 కోట్ల ప్రతిపాదనలు చేసినట్లు, జి.డబ్ల్యు.ఎం.సి పరిధిలో మెరుగైన సౌకర్యాలు, సంక్షేమాలు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. వచ్చే నెలలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభమవుతాయని, వచ్చే ఏడాది చివరికి ప్రధాన రోడ్లు, డ్రైన్లు పూర్తవుతాయని హామీ ఇచ్చారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచించారు. నాణ్యతలో లోపాలు ఉంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో కొణిజేటి రోశయ్య వర్ధంతి



**కరీంనగర్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన రాష్ట్రానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఏవో సుధాకర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్య స్వామికి ఫలపంచామృతాభిషేకం



**కరీంనగర్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కృతికా నక్షత్రం సందర్భంగా నగునూర్‌లోని పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలో ఉమాసుతుడైన శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి ఆలయ అర్చకులు విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి నూతన వస్త్రాలంకరణ చేసి ప్రత్యేక హారతి, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మన్, కమిటీ సభ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి తోపాటు భక్తులు పాల్గొన్నారు.

## శాతవాహన విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల శంకుస్థాపన



**హుస్నాబాద్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజా పాలన విజయోత్సవాల భాగంగా హుస్నాబాద్‌ను సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాతవాహన విశ్వవిద్యాలయానికి చెందిన 35 ఎకరాల స్థలంలో సుమారు 30 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన ఇంజనీరింగ్ కళాశాల భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శాతవాహన ఉపకులపతి, అమెరికా పర్యటనలో ఎన్నారైల సహకారంతో అందిన 70 సైకిళ్లను విద్యార్థులకు బహుకరించారు. ముఖ్యమంత్రిని కలసి ధన్యవాదాలు తెలుపుతూ జ్ఞాపకాన్ని అందజేశారు. బీటెక్‌లో నాలుగు కోర్సులతో ఈ ఇంజనీరింగ్ కళాశాల 2025-26 విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభించనున్నట్లు విశ్వవిద్యాలయం ప్రకటించింది.

# బార్ అసోసియేషన్‌లో స్థల వివాదం చుట్టూ కలకలం

**పెద్దపల్లి, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్‌ను తొలగిస్తూ కొందరు కార్యవర్గ సభ్యులు చేపట్టిన అవిశ్వాస తీర్మానం, సస్పెన్షన్ నిర్ణయం తీవ్ర వివాదానికి దారితీసింది. ఇది పూర్తిగా అక్రమమని, అసోసియేషన్ బైలాకు విరుద్ధమని భాస్కర్ స్పష్టం చేశారు. జిల్లా కోర్టు స్థల కేటాయింపు వివాదాన్ని అడ్డుపెట్టుకుని తనపై రాజకీయ కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. రాఘవపూర్ వద్ద 10 ఎకరాలు కేటాయించడం 114 మంది సభ్యుల సంతకాలతో 2023లోనే ఆమోదించబడిందని, ఈ వివాదం కారణంగా రూ.81 కోట్ల నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తనపై అవిశ్వాసం బైలాలో లేదని, మార్చి 31 వరకు తానే అధ్యక్షుడని భాస్కర్ స్పష్టం చేశారు. అక్రమ చర్యలకు పాల్పడిన వారిపై హైకోర్టులో లీగల్ చర్యలు తీసుకుంటానని, ఇప్పటికే బార్ కౌన్సిల్, డీజేకు ఫిర్యాదు చేశానని తెలిపారు.




సీనియర్ సభ్యులు దొంతి కిష్టయ్య, గౌరిశెట్టి సత్యనారాయణ, పుట్ట రవి మాట్లాడుతూ అధ్యక్షుడి సస్పెన్షన్ నిర్ణయం చట్ట విరుద్ధమని, అడ్వకేట్ యాక్ట్‌కు వ్యతిరేకమని పేర్కొన్నారు. రాఘవపూర్‌లో కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం హైకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా తీసుకున్న మంచి నిర్ణయమని, గతంలో వ్యతిరేకిస్తున్న సభ్యులే సంతకాలు చేశారని గుర్తుచేశారు. అధ్యక్షుడిని తొలగించడం అసోసియేషన్ చరిత్రలో ఇదే తొలిసారి అని, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన లకిడి భాస్కర్ తన పదవీకాలం వరకు కొనసాగుతారని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అనేక మంది సభ్యులు పాల్గొని లకిడి భాస్కర్‌కు మద్దతు ప్రకటించారు.

# మంథని -పెద్దపల్లి రహదారిపై ప్రయాణికుల అవస్థలు



**మంథని, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

: పెద్దపల్లి జిల్లా మంథని డిపోకు చెందిన బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రతిరోజూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ఏ ఒక్క బస్సు రాకపోవడంతో బస్టాండ్‌తో పాటు హైవేపై కూడా రద్దీ పెరిగిపోతోంది. విద్యార్థులు పాఠశాలకు ఆలస్యంగా చేరుతుండగా, ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ప్రైవేట్ వాహనాలు అందుబాటులో లేక ప్రయాణికులు పడిగాపులు పడుతున్నారు. ప్రతిరోజూ ఇదే పరిస్థితి ఎదురవుతోందని ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రయాణికులు, టీజీ ఆర్ టీసీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని బస్సులు సమయానికి నడవేలా చూడాలని కోరుతున్నారు. సమయపాలనలో లోపాలు కొనసాగితే పెద్ద సంఖ్యలో ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# విమానాశ్రయం సాధ్యసాధ్యాలపై సమీక్ష

**రామగుండం, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రామగుండం నియోజకవర్గం అంతర్గాం మండల కేంద్రంలో ప్రతిపాదిత విమానాశ్రయం స్థలాన్ని పరిశీలించేందుకు ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ బృందం గురువారం ప్రాంతాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా బృందాన్ని ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మర్యాదపూర్వకంగా కలిసి, ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు సాధ్యసాధ్యాలపై చర్చించారు. అధికారులు అంతర్గాం మండల కేంద్రంలోని 977 ఎకరాల స్థలాన్ని పరిశీలించడంతో పాటు ఎల్లంపల్లి గోదావరి పరిసరాలు, స్పిన్నింగ్, వీవింగ్ మిల్ ప్రాంతాలను కూడా పరిశీలించారు. అనంతరం రామగుండం ఎన్టీపీసీ జ్యోతి భవన్‌లో సమీక్ష సమావేశం జరిగింది. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు



విషయంలో గతంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులతో సమీక్ష జరిగినట్లు గుర్తుచేశారు. ఇప్పటికే పూర్తి స్థాయి ఫిజిబిలిటీ రిపోర్టు సిద్ధం చేస్తున్నామని, త్వరలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని అధికారులు తెలిపారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుతో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ప్రజలకు, పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధికి ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం పెద్ద ఎత్తున ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్ డిఓ గంగయ్య, అంతర్గాం తాసిల్దార్ తోము రవీందర్ పటేల్, మైన్స్, ట్రాన్స్కో, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, ఎన్టీపీసీ , సింగరేణి, బిల్డింగ్, ప్లానింగ్, పోలీస్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**పెద్దపల్లి, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి మహాలక్ష్మి జిన్నింగ్ మిల్లులో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించారు. అనంతరం రైతు కలవెన మల్లేశంకు చెందిన 27 క్వింటాళ్ల 80 కిలోల పత్తిని మొదటగా కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నాణ్యమైన ఏ గ్రేడ్ పత్తికి క్వింటాలుకు రూ.8100 మద్దతు ధర ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. పత్తిలో తేమ 8 నుండి 12 శాతం లోపు ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంటల దిగుబడి తగ్గిందని, రైతులు పంటల మార్పిడీపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. వరి కోయకాలు కాల్చడం వల్ల భూసారం తగ్గిపోతుందని, పంట అవశేషాలను భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. పత్తి చివరి దశలో ఉండడంతో యాసంగి సాగులో మొక్కజొన్న సాగు లాభదాయకమని, హైబ్రిడ్ సీడ్ మొక్కజొన్నతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల పంటలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జిన్నింగ్ మిల్ యజమానులు నర్సింగరావు, మంగారావు, సిసిఐ అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, బీజేపీ నాయకుల కాంగ్రెస్ చేరిక



**పెద్దపల్లి, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, ప్రజా సేవలతో ఆకర్షితులైన హనుమంతునిపేట గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని, అందువల్లే ఇతర పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రజల సహకారంతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. హనుమంతునిపేట గ్రామ నాయకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరడం పార్టీ బలాన్ని మరింత పెంచుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# శాతవాహన బాలికల వసతి గృహంలో ఆరోగ్య శిబిరం



**కరీంనగర్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

శాతవాహన విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని అన్యోన్య బాలికల వసతి గృహంలో రెనే హాస్పిటల్, రజిని ఫెర్టిలిటీ సెంటర్ సౌజన్యంతో మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ పెట్టి మంచి ఫలితాలు సాధించగలరని, సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అత్యంత అవసరమని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ వసతి గృహంలో చికిత్స గదిని ప్రారంభించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ రజనీ ప్రియదర్శిని విద్యార్థినులు మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఆహారంలో పళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శిబిరంలో 450 మంది విద్యార్థినులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెనే హాస్పిటల్ వైద్యులు, విశ్వవిద్యాలయ అధికారులు, ప్రిన్సిపల్స్, వార్డెన్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం కొణిజేటి రోశయ్య నాల్గవ వర్ధంతి



**కరీంనగర్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నాల్గవ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కంకణాల అనిల్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి చైర్మన్ నరేందర్ రెడ్డి హాజరై రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ మాట్లాడుతూ, రోశయ్య రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా, ఆర్థిక శాఖ మంత్రిగా పలు పదవులు చేపట్టి వాటికి వన్నె తెచ్చారని, ఆయన చూపిన బాటలో నడవాలని అన్నారు. కార్యక్రమంలో శ్రావణ నాయక్, కొర్వి అరుణ్ కుమార్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, సలీముద్దీన్, అబ్దుల్ రెహమాన్, కోడూరు రవీందర్ గౌడ్, దన్నా సింగ్, మామిడి సత్యనారాయణ రెడ్డి, హసీనా, కుంభాల రాజకుమార్, ముద్దసాని క్రాంతి, సిరిపురం నాగప్రసాద్, నేతికుంట యాదయ్య, చింతల కిషన్, పర్వత మల్లేశం, శిల్ప, జ్యోతి రెడ్డి, జీలకర్ర రమేష్, అందశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగో వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి కూన సావిత్రి గడపగడప ప్రచారం

**వెల్దండ, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాలుగో వార్డులో సర్పంచ్ అభ్యర్థి కూన సావిత్రి గురువారం గడపగడప ప్రచారాన్ని కొనసాగించారు.ప్రచారంలో ఆమె తన గుర్తు గౌనును మహిళలకు చూపిస్తూ, వృద్ధులను కలుసుకుని మమ్మురంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారానికి ఊతమిచ్చారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి కూన సావిత్రి, పాండు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణ, గుద్దటి కిష్టాలు, కోటిగారి శేఖర్, జంగిలి ఆనంద్, జంగిలి మహేందర్, కూన నాని, గోరేటి భరత్, ఏకుల వెంకటేష్, ఆలూరు డేవిడ్, జంగిలి రాఘవేందర్, కూన పవన్, బన్నీ, సన్నీ, కూన కృష్ణయ్య, కూన సందీప్, కూన ప్రశాంత్, ఈదులపల్లి రాజు, కొప్పు వినోద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# గుండె ఆపరేషన్ కోసం రక్తదానం

**కరీంనగర్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




గుండె ఆపరేషన్ నిమిత్తమై అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరమైన సమయంలో ఎక్సైజ్ డిపార్ట్మెంట్ కానిస్టేబుల్ గాలిపెల్లి రాజశేఖర్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కరీంనగర్‌లోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఎల్లయ్య (70) ప్రాణాన్ని కాపాడుతూ ఆయన ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా గాలిపెల్లి కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది సకాలంలో రక్తం అందక ఇబ్బందులు పడుతున్నారని, రక్తదాతలు ముందుకు వస్తే ఎన్నో ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. రక్తదానం చేసిన రాజశేఖర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజలు రక్తదానం చేయాలని, ప్రాణదాతలుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

# సిద్దిపేటలో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య వర్ధంతి



**సిద్దిపేట, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఉమ్మడి రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా పనిచేసి రాష్ట్రానికి విశేష సేవలు అందించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, డిబిసిఓ సయ్యద్ రఫీ, ఏఓ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరుకాపుల ఐక్యతకు కృతజ్ఞతలు



**కరీంనగర్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రంలో మున్నూరుకాపుల ఐక్యతకు, రాజ్యాధికార దిశగా కృషి చేస్తానని ప్రకటిస్తూ, తన నియామకానికి సహకరించిన నాయకులకు మున్నూరు కాపు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మంకమ్మతోట మున్నూరు కాపు సంఘ అధ్యక్షుడు ముప్పిడి సునీల్ కుమార్ పటేల్ మాట్లాడుతూ, రాష్ట్ర మున్నూరు కాపు సంఘ అధ్యక్షులు గౌరవనీయ పుటం పురుషోత్తం పటేల్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరి శంకర్, జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాలువల రవీందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కనకం అమర్ పటేల్, దామర సంతోష్ పటేల్, కంజర్ల రేణుకతో పాటు కుల బాంధవులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరుకాపుల ఐక్యత కోసం సమిష్టిగా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# పంచాయతీ ఎన్నికల సమీక్ష




**కరీంనగర్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఎన్నికలు నిబంధనల ప్రకారం జరగాలని ఆమె సూచించారు. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, జనరల్ అబ్జర్వర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. నామినేషన్ల ప్రక్రియ, ఫలితాల ప్రకటన, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం, ఉపసర్పంచ్ నియామకం వంటి అంశాలపై కమిషనర్ దృష్టి సారించారు. ఎన్నికల ప్రచారంలో నియమావళి ఉల్లంఘనలు జరగకుండా పక్కా నిఘా ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. అదనపు డిజిపి మహేష్ భగవత్ ఎన్నికల సమయంలో అక్రమంగా నగదు, మద్యం, ఆభరణాలు తరలిస్తే సీజ్ చేయాలని, పోలింగ్ నాడు అంతర రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు



**మానకొండూర్, డిసెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మానకొండూర్ మండలం ఊటూరు గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వారికి కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ కుటుంబంలో సభ్యులవడం ఆనందకరమని, పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి వెనకడుగు వేసిందని, అవినీతి, అక్రమాలతో రాష్ట్ర ఖజానా దెబ్బతిన్నదని ఆయన విమర్శించారు. ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పాలనకు ముగింపు పలికారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నదని ఎమ్మెల్యే వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం సరఫరా వంటి హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు. గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ వారి కలలను సాకారం చేస్తున్నామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధిలో పంచాయతీ ఎన్నికలు కీలకమని, కాంగ్రెస్ మద్దతుదారులను సర్పంచులుగా గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. మనోళ్లను గెలిపించుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి ఎక్కువ నిధులు పొందే అవకాశం ఉంటుందని, తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న వారిలో ఎనగందుల మల్లయ్య, బక్కయ్య, శంకర్, రాజు, కల్వల అంజయ్య, బొల్లం సంధ్య, కె. అంజయ్య, జినుక అంజయ్య, అంతడ్పుల అనిల్, సాగర్, ఎనగందుల శ్రీకాంత్, విజయ్, మహేశ్, శివనాథ్, ఆర్. నరేష్, కె. నరేష్, రాజేశ్, హన్మంతు, రమేశ్, శ్రీనివాస్, అరవింద్, చందు, సంపత్, వెంకటేష్ అంజి, రంగయ్య, రాజేందర్, వంశీ, దాసరి ఆదిత్య, కె. నర్సింహారెడ్డి, చంద్రయ్య, నీరటి సంపత్, రామడుగు రమేశ్, పుట్ట తిరుపతి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఊటూరు గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు బొంగోని సునిల్ గౌడ్, పార్టీ నాయకులు గోపు శ్రీనివాస్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ అభ్యర్థి వెలిశెట్టి కళ్యాణి-కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ కంటి చూపును సంరక్షించుకోవాలి

## పి.డి.జి. చెన్న కిషన్ రెడ్డి



**కందుకూరు, డిసెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తిమ్మాపూర్ గ్రామంలోని నూతన దేవాలయం ప్రాంగణంలో గురువారం జరిగిన కార్యక్రమంలో 320A జిల్లా మాజీ గవర్నర్ గంగపురం చిన్న కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి చూపును సంరక్షించుకోవాలని సూచించారు. గత నెల 25న స్వర్గీయ గంగపురం వెంకట్ రాజిరెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఈరోజు 46 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు కోసం ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ గత 108 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నదని కొనియాడారు. మార్ర్యాల గ్రామాల పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గిరిజన తండాలలో వెనుకబడిన గూడాలలో సమాచారం అందిస్తే స్వచ్ఛందంగా కంటి శిబిరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. యువత గ్రామాభివృద్ధి, పేద ప్రజల ఔన్నత్యం కోసం ముందుకు రావాలని, అందుకు లైన్స్ క్లబ్ తోడుగా ఉంటుందని వివరించారు. లైన్స్ క్లబ్ నిర్వహించే కార్యక్రమాలకు ఎవరి నుంచి ఒక రూపాయి కూడా తీసుకోకుండా ఉచిత సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 320A జిల్లా క్యాబినెట్ సెక్రటరీ తాళ్ల అంజయ్య మాట్లాడుతూ మార్ర్యాల గ్రామం, కర్తాల్ ప్రాంతంలో లైన్స్ క్లబ్ సేవలు అందుతున్నాయి అంటే, అది చెన్న కిషన్ రెడ్డి గారి మద్దతు వల్లేనని పేర్కొన్నారు. స్వర్గీయ వెంకట్ రాజిరెడ్డి జ్ఞాపకార్థం లక్షలాది రూపాయలతో మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించడం ఆయన సేవా గుణానికి నిదర్శనమని కొనియాడారు. కంటి అద్దాల దాత లైన్ జి. చిన్న కిషన్ రెడ్డి మాట్లాడుతూ తన గ్రామ ప్రజలకు చేయూత అందించడం తనకు ఎంతో తృప్తినిచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు లక్ష్మీ నరసింహ రెడ్డి, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్, లైన్స్ క్లబ్ ఆఫ్ కందుకూర్, లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ బాలాజీ నగర్ సంయుక్తంగా నిర్వహించాయి. ఇందులో ఆమనగల్ క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి గంప శ్రీను, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, పిఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.


# మూడవ విడత నామినేషన్ల స్వీకరణను పారదర్శకంగా నిర్వహించాలి

## -జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గురువారం ఆమె నల్గొండ జిల్లా, కొండమల్లేపల్లి మండలం, గుమ్మడవెల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. గుమ్మడవెల్లి గ్రామపంచాయతీ లో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రంలో నోటిఫికేషన్, నామినేషన్ వేసేందుకు వచ్చే వారికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు రూపొందించిన ఫ్లెక్సీ బ్యానర్ ,ఆ క్లస్టర్ పరిధిలో గ్రామ పంచాయతీల రిజర్వేషన్లు, డిజిటల్ క్లాక్, తదితర వివరాలను రిటర్నింగ్ అధికారి ద్వారా అడిగి తెలుసుకున్నారు. కుల ధ్రువీకరణ పత్రం డిక్లరేషన్ లో తీసుకున్న పక్షంలో నామినేషన్ల పరిశీలన సమయం వరకు ఒరిజినల్ కులదృవీకరణ పత్రం సమర్పించే విధంగా చెప్పాలని తెలిపారు. కాగా ఒరిజినల్ కుల దృవపత్రాన్ని సమర్థిస్తున్నారని రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ కు బదులిచ్చారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఏవైనా సందేహాలు వస్తే ఆర్డీవో లేదా పై అధికారులతో నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న అండేకార్ యాదిలాల్




**కడ్తాల్, డిసెంబరు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో గురువారం గురు స్వామి, న్యాయవాది బద్రిపల్లి మధు ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు గురుస్వాములు నర్సింగ్ రావు, ఆనంద్ గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు కొనసాగగా, అయ్యప్ప భక్తుల గీతాలాపనలు, భజనలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో ఒత్తిళ్లను అధిగమించి ఆనందమయ జీవనం పొందవచ్చునని పేర్కొన్నారు. మానవాళి సన్మార్గ పురోగమనానికి దైవ కార్యక్రమాలు దోహదపడతాయని, సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందని ఆయన అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్య నాయక్, పిఎసిఎస్ డైరెక్టర్ జోగు వీరయ్య, న్యాయవాదులు ఆంజనేయులు, రామకృష్ణ, శ్రీను, గణేష్, గిరి, వెంకటేష్, సర్దార్, శ్రీశైలం, జగన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దత్త జయంతి



**నల్లగొండ, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పట్టణంలోని శివాజీ నగర్ షిరిడి సాయిబాబా మందిరం నందు దత్త జయంతి గురువారం ఆలయ ప్రధాన పూజారి శనగల మురళీధర్ శర్మ పండ్ల రసాలతో, విభూది చందనంతో అభిషేకం నిర్వహించి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎనుగుల లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ మందడి మధుసూదన్ రెడ్డి, దాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, పూజారి సుబ్రహ్మణ్య శర్మ, అనంత రామ శర్మ, బిఫిన్ పాండే, మురారి శెట్టి సత్యనారాయణ, జగిని వెంకన్న, గుండా కోటప్ప, గోవింద రెడ్డి, విద్యాసాగర్, భీష్మాచారి, గోలి విజయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనగర్‌కాలనిలో అయ్యప్ప పడిపూజ అన్నదానం



**నల్లగొండ,డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** పట్టణంలోని శ్రీనగర్‌కాలనిలో గురు వారం బాలరాజు, మనోహర్ గురుస్వాములు ఘనంగా అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకు వినోద్‌కుమార్ ప్రీతి ఆద్వర్యంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మేడం విశ్వ ప్రసాద్ గురు స్వామి, బండారు వెంకటేశ్వర్లు,సోమా వెంకటేశ్వర్లు, పద్మావతి,చౌక్కారపు మాధవి, వెంకన్న, ఆద్య , శ్రీ వాగ్దేవి, మిరియాల నిర్మల, దేవేందర్, గుమ్మడవెల్లి ధనయ్య, డాక్టర్ కజ్జం సందీప్ , మంతెన మాధవి, పద్మ, వెన్నెల, సాయి నిఖిల్ , యామ కవిత, తోట సంధ్య, రాధిక, లక్ష్మమ్మ , భక్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామికి ఆలయ కమిటీ ఘన స్వాగతం



**బెల్లంపల్లి, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి గురువారం శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించారు. ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో, అష్ట ఐశ్వర్యాలతో అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు. తరువాత పురోహితుల చేతుల మీదుగా ఎమ్మెల్యేకు శాలువా సత్కారం జరగగా, ఆయన తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పాల్గొని ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.

# ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి

**- ఎం. బాల నరసింహ**



**నాగర్‌కర్నూల్ జిల్లా, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దకొత్తపల్లి మండలంలోని చంద్రకల్ గ్రామంలో జరగబోయే రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్లలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. బాల నరసింహ ఆరోపించారు. 1వ వార్డులో నామినేషన్ వేసిన అభ్యర్థిని ప్రతిపాదించిన సభ్యుడు మళ్లీ మరో నామినేషన్ వేయడం, అలాగే 3వ, 4వ, 5వ, 6వ వార్డులలో ఇద్దరు అభ్యర్థులకు ఒకే వ్యక్తి బలపరచడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఈ నామినేషన్లను రద్దు చేయాలని ఆర్వో, ఆర్డీవో, డిపిఓలకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. నామినేషన్లు రద్దు చేయకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అధికార బలంతో తప్పుడు నామినేషన్లను ఆమోదించిన ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులపై న్యాయపరమైన పోరాటం చేస్తామని ఎం. బాల నరసింహ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ నాయకుల అత్యవసర సమావేశం




**కరీంనగర్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. రేపు నూతనంగా నియమిత జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యంను ఘనంగా స్వాగతించేందుకు ఏర్పాట్లు చేయడం, ప్రతి బూత్ నుంచి 100 సంతకాల సేకరణతో పాటు ఓటు చోరీ అంశంపై చర్చించడం ఈ సమావేశం ప్రధాన ఎజెండాగా నిలిచింది. అర్బన్ డిసిసి అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, బీసీ, యూత్ కాంగ్రెస్ విభాగాల నాయకులు, నగర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ సమావేశం



**అమ్రాబాద్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండలం (బి.కే) తిరుమలాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నల్ల పోతుల గురవమ్మ ఎల్లయ్యను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎడ్ల వెంకటేశ్వర్లు, హనుమంతు మరియు ఇతరులు ఎంపిక చేశారు. గ్రామ కమిటీని బలపరచడంలో భాగంగా ఈ సమావేశం నిర్వహించబడింది.

# ఈనెల 6న దేవరకొండలో ముఖ్యమంత్రి పర్యటన

**ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎమ్మెల్యే బాలునాయక్ .**



**దేవరకొండ, డిసెంబర్ 04. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** ఈనెల 6న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవరకొండ పర్యటన సందర్భంగా సభ ఏర్పాట్లను జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్ ఎలా అభివృద్ధి చేదిందో దేవరకొండ నియోజకవర్గం కూడా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ని కోరనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పాలన ప్రజలు ప్రేమతో స్వీకరిస్తున్నారని వారు చెప్పారు. శ్రీశైలం స్వరంగ మార్గాన్ని మూడు సంవత్సరాలలో పూర్తి చేసుకొని జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు, అందుతుందని మంత్రి చెప్పారు. ఇదే దేవరకొండలో పదేండ్లు పాలన చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుర్చీ వేసుకొని నక్కలగండిని పూర్తి చేసి నల్లగొండ జిల్లాని సస్యశ్యామలం చేస్తానని చెప్పిన పెద్దాయన టెంకడు మట్టి కూడా తీయలేదని మంత్రి అన్నారు. ఎనిమిది వేల కోట్లు ఆదాయం ఆర్టీసీ సంస్థకు చెల్లించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కొనసాగుతుందని మంత్రి అన్నారు. సన్న బియ్యం పేద ప్రజలకు అందించడంలో ఐదు వేల కోట్లు ఖర్చు బారమైన ప్రభుత్వం వెనుకాడకుండా ముఖ్యమంత్రి తినే సన్నబియ్యం పేద ప్రజలు కూడా తినాలని దేశం లో ఎక్కడ లేని విధంగా ఆలోచించి మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి అందిస్తున్నారని ఆయన చెప్పారు. సొరంగంలో జరిగిన ప్రమాద ఘటన తో పనులు కొంత ఆలస్యమైనా పూర్తిచేసుకుని ఈ ప్రాంతానికి సాగు, త్రాగునీరు అందించే బాధ్యత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని మంత్రి గుర్తు చేశారు. విద్యుత్ భారం కాకుండానే శ్రీశైల సొరంగ మార్గం పూర్తిచేసుకుని గ్రావిటీ ద్వారా సాగు త్రాగునీరు అందించేందుకే ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేవరకొండ నియోజకవర్గం కొడంగల్ మాదిరిగా దత్తత తీసుకొని అభివృద్ధి చేసేందుకు తాము ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు మంత్రి తెలిపారు. పేద ప్రజలు విద్యకు దగ్గర కావడానికి 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను ప్రారంభించుకొని పేదవారికి నాణ్యమైన విద్యను అందించేందుకే ముఖ్యమంత్రి ముందుకెళ్తున్నట్లు మంత్రి చెప్పారు. ఈ నియోజకవర్గంలో గతంలో ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి చేసిన అభివృద్ధి తప్ప మళ్ళీ రేవంత్ రెడ్డి ఆయంలోనే నియోజకవర్గ అన్ని రంగాల అభివృద్ధి చెందుతుందని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. మంత్రి వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, జాల నరసింహారెడ్డి, ఏవి రెడ్డి, ఎండి యూనిస్, పొన్నబోయిన సైదులు, డాక్టర్ వేణుధర్ రెడ్డి, పానుగంటి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న మన్నే రాజు, గుబ్బల లక్ష్మీనారాయణ



**సుభాష్ నగర్,డిసెంబర్ 04(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ సాయిబాబా నగర్ కృషి కాలనీలో గురువారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. శ్రీనివాసరావు, కన్నె స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నే రాజు గారు, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ గారు ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి పూజలు, భజనలు, గీతాలాపనలు నిర్వహించగా, కాలనీవాసులు అధిక సంఖ్యలో హాజరై భక్తి భావంతో పాల్గొన్నారు. కార్యక్రమంలో విజయభాస్కర్ రెడ్డి, సత్తి రెడ్డి, గురువా రెడ్డి, గోపాల్ ముదిరాజ్, దుర్గా రెడ్డి, ముత్యాలు, ప్రభాకర్, రాజు, సంతు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడండి

**ఇనుగుర్తి, డిసెంబర్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్ మరియు డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క గ్రామం కూడా అభివృద్ధి బాటలో నడవలేదని విమర్శించారు. కాంగ్రెస్ మద్దతుతో భారీలో నిలిచిన అభ్యర్థులను గెలిపించి గ్రామాలను అభివృద్ధి దిశగా నడిపించేందుకు ప్రజలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా కోమటిపల్లి, పెద్ద తండా, చిన్న ముప్పారం, లక్ష్మీపురం, చిన్న



నాగారం, మమట్యా తండా, చిన్య తండా, అయ్యగారిపల్లి, లాలూ తండా గ్రామాలను సందర్శించారు. మురళి నాయక్ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివే అవకాశం పొందారని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎన్నో పేదల ప్రాణాలు కాపాడబడ్డాయని గుర్తు చేశారు. పేదల కోసం ఆలోచించే పార్టీ దేశంలో, రాష్ట్రంలో ఉందంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీ అని స్పష్టం చేశారు. రేవంత్ సర్కార్ ఏర్పడిన తరువాత సన్నబియ్యం, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, భూ భారతి, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ గ్రామ ప్రజలే కేంద్రంగా పాలన సాగుతోందని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో ఒక్క పేద వాడికి కూడా న్యాయం జరగలేదని విమర్శించారు. గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిస్తే అభివృద్ధి ఏంటో చూపిస్తామని ఎమ్మెల్యే మురళి నాయక్ హామీ ఇచ్చారు.

# సత్యనారాయణ చారి మృతి బాధాకరం

**దేవరకొండ వడ్డెర సంఘం నియోజకవర్గ ఇన్చార్జి ఇరగదిండ్ల కృష్ణ.**



**దేవరకొండ డిసెంబర్ 04. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** చందంపేట మండలం, చిత్రాల గ్రామానోకి చెందిన కూరెళ్ల సత్యనారాయణ చారి మృతి బాధాకరమని దేవరకొండ బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు ఇరగదిండ్ల,కృష్ణ అన్నారు. దేవరకొండ పట్టణం లోగాంధీ నగర్ లోకూరెళ్ళ కృష్ణమాచారి గోల్డ్ జ్యువెలరీ షాప్ ఓనర్ లైన్స్ క్లబ్ మెంబర్, నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం నాయకులు అలాగే స్వచ్ఛంద సంస్థలలో చాలా చురుకుగా పాల్గొని అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తి కృష్ణమాచారి అని , ఇతని ఆత్మ శాంతి చేకూరాలని సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని భగవంతుడు ధైర్యాన్ని నింపాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నాను అని ఆయన అన్నారు.

# చలికాలంలో డ్రైవర్లు తీసుకోవలసిన జాగ్రత్తలు పై జిల్లా ఎస్పీ సూచనలు

**మహబూబాబాద్, డిసెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
చలికాలంలో పొగమంచు కారణంగా రోడ్లు, వాహనాలు, పాదచారులు, జంతువులు, సిగ్నల్స్ స్పష్టంగా కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ పరిస్థితుల్లో డ్రైవర్లు కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎస్పీ పేర్కొన్న ముఖ్యాంశాలు:చలి కాలంలో గమ్యస్థానానికి వెళ్లేటప్పుడు ముందుగానే బయలుదేరడం మంచిదని, పొగమంచు కారణంగా ఆలస్యం జరిగే అవకాశం ఉండటంతో తొందరపాటు డ్రైవింగ్‌ను నివారించవచ్చని తెలిపారు. అతివేగం, ఓవర్‌టేకింగ్ చేయడం ప్రమాదకరమని, లోబీమ్ లైట్లు, ఫాగ్ లైట్లు వాడితే వాహనాలు స్పష్టంగా కనిపిస్తాయని సూచించారు.ముందున్న వాహనానికి సురక్షిత




దూరం పాటించడం, నిర్దేశిత లేన్లలోనే వాహనాన్ని నడపడం, అవసరమైతే కిటికీ అద్దాలను కొద్దిగా దించడం ద్వారా డ్రైవర్ దృష్టి మెరుగుపడుతుందని చెప్పారు. పొగమంచు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వాహనాన్ని కాసేపు ఆపి, పరిస్థితులు స్పష్టంగా కనిపించిన తరువాతే ప్రయాణం కొనసాగించాలన్నారు.వాహన అద్దాలను శుభ్రంగా ఉంచుకోవడం, వైపర్లు, డీఫ్రాస్టర్లను ఉపయోగించడం ద్వారా దృష్టి స్పష్టంగా ఉంటుంది. ముందుగా ఇండికేటర్లను వాడి వెనుక వాహనదారులకు సంకేతాలు ఇవ్వాలని, సడన్ బ్రేకింగ్ చేయకుండా నెమ్మదిగా బ్రేక్‌లు వేయాలని సూచించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ఈ సూచనలు పాటిస్తే చలికాలంలో జరిగే ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి డ్రైవర్ తన భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడే బాధ్యతతో వాహనం నడపాలని పిలుపునిచ్చారు.

# డ్రగ్స్ రహిత జిల్లా యే మా లక్ష్యం

**కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

**మహబూబాబాద్,డిసెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ స్పష్టం చేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ తో కలిసి ఆయన నేషనల్ నార్కోటిక్స్ కో-ఆర్డినేషన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల రవాణా, వినియోగం చేసే వారిపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువతను దృష్టిలో ఉంచుకుని కళాశాలల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మాదకద్రవ్యాల అలవాటుకు ఎవరూ బానిసలు కాకూడదని, ముఖ్యంగా యువత మేల్కొని డ్రగ్స్‌ను పూర్తిగా



వదులుకోవాలని పిలుపునిచ్చారు.వైద్య, ఆరోగ్యం, రెవెన్యూ, విద్య, అటవీ, డ్రగ్స్ తదితర శాఖల అధికారులు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. జిల్లాలోని రెవెన్యూ, మార్కెటింగ్, అటవీ, పోలీసు చెక్‌పోస్టుల్లో పటిష్ఠ నిఘా పెట్టాలని, రైల్వే, బస్ స్టేషన్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు.డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఎంఈవోలతో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని, వైద్యాధికారులు, ఏరియా హాస్పిటల్స్, సీహెచ్‌సీలలో మాదకద్రవ్యాలు సేవించి వచ్చే వారి వివరాలను పోలీసులకు అందజేయాలని ఆయన సూచించారు. వీఆర్ఏ, వీఆర్‌వోలకు గ్రామాల్లో డ్రగ్స్ వినియోగం చేస్తున్న వారి వివరాలను తెలియజేయాలని ఆర్డీవోలకు ఆదేశించారు.జిల్లాలో విస్తృత ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మందుల నాణ్యత ప్రమాణాలు పరిశీలించాలని, చిట్టి లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ మందులు పంపిణీ చేయరాదని మెడికల్ షాపుల యజమానులకు తెలియజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఎస్పీ తిరుపతి రావు, ఎక్సైజ్ శాఖ అధికారి కిరణ్ కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీ రామ్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల, డ్రగ్స్ ఇన్స్పెక్టర్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# లష్కర్ గూడ సర్పంచ్ అభ్యర్థిగా మునుకుంట్ల శ్రీధర్ గౌడ్

**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 04 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్ గూడ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా గ్రామానికి చెందిన మునుకుంట్ల శ్రీధర్ గౌడ్ గురువారం తన నామినేషన్‌ను గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారికి సమర్పించారు.నామినేషన్ అనంతరం శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ "అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా" అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నానని తెలిపారు. గ్రామ అభివృద్ధినే లక్ష్యంగా చేసుకొని సిసి రోడ్లు, డ్రైనేజీలు, వాడవాడల విద్యుత్ సౌకర్యాలు, యువతకు ఉపాధి అవకాశాలు, నిరుపేద కుటుంబాలకు సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.గ్రామ అభివృద్ధిలో



పెండింగ్‌లో ఉన్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించేందుకు ముందుకు వెళ్తానని, రాజకీయాలకన్నా ప్రజలకు సేవ చేస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన స్పష్టం చేశారు. గత సర్పంచ్ ఎన్నికల్లో మూడో వార్డు నుండి పోటీ చేసి, అక్కడి సమస్యలను దగ్గరుండి పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేసిన అనుభవం తనకు ఉందని గుర్తు చేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి, "మీ అమూల్యమైన ఓటుతో గెలిపించండి గ్రామ అభివృద్ధి ఏంటో చూపిస్తా" అని శ్రీధర్ గౌడ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండల్ గౌడ్, సిద్ధగోని శంకరయ్య గౌడ్, మునుకుంట్ల పార్వతమ్మ, శ్రీనివాస్ గౌడ్, గుండె నరసింహ, మునుకుంట్ల నితిన్ గౌడ్ తో పాటు గ్రామ యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రామేశ్వరంలో పౌర్ణమి సందర్భంగా అన్నప్రసాద వితరణ

**ఫరూక్నగర్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఫరూక్నగర్ మండలంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం, రామేశ్వరంలో ప్రతి నెల పౌర్ణమి సందర్భంగా నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఈరోజు దత్త పౌర్ణిమి సందర్భంగా ప్రత్యేకంగా జరిగింది.ప్రత్యేక పూజలు అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ దత్త పౌర్ణిమి అన్నప్రసాద వితరణకు దాతగా



హన్మారి మురళీధర్ గుప్తా (మొగిలిగిద్ద) ముందుకు వచ్చారు.ఈ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గందే సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సామాజిక కార్యకర్త నీల రవీందర్, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ జిల్లా మలిపెద్ది శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు యశ్వంత్ రాజ్ గుప్తా, పోల బాలరాజ్, వ్యాపారవేత్తలు ఉప్పల సత్యం, అశోక్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# హైరిస్కు గర్భిణీలపై నిరంతర పర్యవేక్షణ అవసరం

**డాక్టర్ బి. రవి రాథోడ్**



**మహబూబాబాద్, డిసెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జిల్లాలో మెటర్నల్ డెత్ ఘటనలు జరగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన మెటర్నల్ డెత్ రివ్యూ సమావేశంలో ఆయన వైద్యాధికారులు, సూపర్వైజర్ స్టాఫ్, ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా తొర్రూరు, కురివి, ఇనుగుర్తి, తొర్రూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో సమీక్ష జరిపిన ఆయన, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణలో ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గర్భిణీ స్త్రీ తప్పనిసరిగా నాలుగు ఆంటీనేటల్ చెకప్‌లు (ఏఎన్సీ) చేయించుకోవాలని, హై బీపీ, అనీమియా, అధిక రక్తస్రావం వంటి ప్రమాద సూచనలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీ స్త్రీలు 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా మెటర్నల్ డెత్ సంభవించిన వెంటనే సంబంధిత సమాచారం ఎండీఆర్ కమిటీకి తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. హైరిస్కు గర్భిణీలను ముందుగానే గుర్తించి, ప్రమాద పరిస్థితులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆయన సూచించారు.జిల్లాలో మరిన్ని మెటర్నల్ డెత్ ఘటనలు జరగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ రవి రాథోడ్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిజిహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీవిద్య, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సారంగం, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్స్ ప్రత్యూష, మౌనిక, సురేష్, సద్విజ, కె.వి. రాజు తదితరులు పాల్గొన్నారు.

# బైరాన్ పల్లి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా కళ్లెబోయిన కుమారస్వామి

**- ప్రకటించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**
**-కష్టపడ్డ కార్యకర్తకే కాంగ్రెస్ పార్టీ మద్దతు**
**-పార్టీకి వ్యతిరేకంగా వెళితే ఉపేక్షించేది లేదు**
**-ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**వర్ధన్నపేట, డిసెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్**
వర్ధన్నపేట నియోజకవర్గం హసన్పర్తి మండల పరిధిలోని బైరాన్ పల్లి గ్రామ పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా కళ్లెబోయిన కుమారస్వామిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రకటించారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ కష్టపడ్డ కార్యకర్తలకే కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా వెళితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షునిగా పనిచేసి కష్ట కాలంలో పార్టీకి విధేయునిగా పదేళ్ల ప్రతిపక్షంలో పార్టీని నమ్ముకుని పనిచేసిన వ్యక్తిని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి గెలిపించాలని హితవు చేశారు. ప్రతీ కార్యకర్తను గుర్తించి కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పిస్తుందని ఎవరూ అధైర్యపడవద్దని కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలియజేశారు.అందరూ సమన్వయంతో పార్టీని ముందుకునడిపించాలని చెప్పారు.అనంతరం సర్పంచ్ అభ్యర్థి కళ్లెబోయిన కుమారస్వామి మాట్లాడుతూ నన్ను గుర్తించి అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే నాగరాజు కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు జట్టి యుగేందర్, రుద్రారపు అనిల్, రెమిడి నితిన్,జట్టి సుప్రవీణ్, జట్టి ప్రశాంత్,ఆకుల రాజు, తదితరులు పాల్గొన్నారు.


# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాలుగో వార్డులో ప్రచారం

**వెల్దండ, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాలుగో వార్డులో సర్పంచ్ అభ్యర్థి జంగిలి సునీత



గురువారం గడపగడప ప్రచారాన్ని కొనసాగించారు.ప్రచారంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థికి మద్దతు తెలిపారు. ప్రజలను కలుసుకుని, సమస్యలను తెలుసుకుంటూ, పార్టీ గుర్తు పరిచయం చేస్తూ ప్రచారం మమ్మురంగా సాగింది.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, అభ్యర్థి జంగిలి సునీత ఆనంద్, వెల్దండ మండల యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి, జంగిలి ప్రవీణ్, జంగిలి దేవదాస్, ఈదులపల్లి జగన్, జంగిలి రవి, గోరేటి రాజు, జంగిలి ఆగమ్మ, జంగిలి కౌశలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ నుండి బిజెపిలో భారీ చేరికలు



**హుజురాబాద్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట, ఇల్లంతకుంట మండలాల మాచినపల్లి, మల్యాల గ్రామాల నుండి పలువురు నాయకులు, కార్యకర్తలు బిజెపిలో చేరారు. ఈ చేరికలు బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి.కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, రాబోయే సర్పంచ్ ఎన్నికల తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారని, ఆ అభివృద్ధిని చూసి మేము బిజెపిలో చేరామని మాజీ టిఆర్ఎస్ నాయకుడు పర్లపెల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకురాలు గుడికందుల పావని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, పుప్పాల రఘు, మండలాధ్యక్షులు సంపెల్లి సంపత్ రావు, బైరెడ్డి రమణారెడ్డి, కొలకాని రాజు, తూర్పాటి రాజు, అలాగే ఉప్పుల రమేష్, బండారి తిరుపతి యాదవ్, దొంతర వీణ రమేష్ యాదవ్, పర్రెపల్లి మనమ్మ, సంపత్ రావు, సాంబమూర్తి, శ్రీనివాస్, అబిడి తిరుపతి రెడ్డి, రావుల విజయ్, కైలాసకోడి గణేష్, చేర్యాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.బిజెపి నాయకత్వం ఈ చేరికలను స్వాగతిస్తూ, గ్రామాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరియు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.

# శ్రీదత్త జయంతి ఉత్సవాలలో పాల్గొన్న నిజామాబాద్ ఎమ్మెల్యే



**నిజామాబాద్, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరంలోని పలు ఆలయాల్లో మార్గశిర మాసం పౌర్ణమి సందర్భంగా శ్రీదత్త జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఉత్సవాలలో ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులతో కలసి శ్రీదత్త స్వామివారి దివ్య దర్శనం పొందారు. అనంతరం మాట్లాడుతూ, "శ్రీదత్త స్వామి సేవాభావం ప్రతి మనిషిలో కొనసాగాలనే సంకల్పంతో నేను ప్రజల శ్రేయస్సు, సమాజ అభివృద్ధి, ధార్మిక ప్రేరణను ముఖ్య కర్తవ్యంగా తీసుకుని ముందడుగు వేస్తాను. భక్తులందరికీ సౌకర్యాలు, భద్రత, మౌలిక వసతులు అందించడం మా ప్రాధాన్యత. భక్తుల ప్రేమ, విశ్వాసం, ఆధ్యాత్మిక శక్తి సమాజానికి కొత్త దిశను చూపుతుంది. ప్రజలతో కలసి క్షణాలు పంచుకోవడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇల్లందుల ప్రభాకర్, మఠం పవన్, ముందడ పవన్, బాబీ సింగ్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# ఎలిగేడులో భారీగా నామినేషన్లు



**ఎలిగేడు, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండలంలోని 12 గ్రామాల పరిధిలో పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గురువారం రెండో రోజు నాలుగు క్లస్టర్ల పరిధిలో మొత్తం 159 నామినేషన్లు దాఖలయ్యాయని ఎం.పి.డి.వో భాస్కర్ రావు తెలిపారు.ఎలిగేడు క్లస్టర్ పరిధిలో 7 సర్పంచి, 30 వార్డు స్థానాలకు, ధూళికట్ట క్లస్టర్‌లో 10 సర్పంచి, 45 వార్డు స్థానాలకు, నర్సాపూర్ క్లస్టర్‌లో 10 సర్పంచి, 32 వార్డు స్థానాలకు, సుల్తాన్‌పూర్ క్లస్టర్ పరిధిలో 2 సర్పంచి, 23 వార్డు స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.మొత్తం మీద సర్పంచి స్థానాలకు 29, వార్డు సభ్యుల స్థానాలకు 130 నామినేషన్లు సమర్పించబడ్డాయి. గ్రామాల్లో ఎన్నికల వాతావరణం ఉత్సాహభరితంగా మారిందని అధికారులు తెలిపారు.

# వలస కార్మికుల పిల్లల చదువుకు ప్రోత్సాహం

## కలెక్టర్ పమేలా సత్పతి



**గంగాధర, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలోని వలస కార్మికుల పిల్లల చదువును ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గంగాధర మండలం గట్టుభూత్కూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వలస కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతి గదిని గురువారం ఆమె ప్రారంభించారు.ఈ తరగతిలో 42 మంది పిల్లలను గుర్తించి విద్యాబోధన ప్రారంభించారని కలెక్టర్ వివరించారు. చిన్నారులతో మమేకమై వివిధ భాషల్లో పలకరించి వారి చదువు, స్వస్థలం, కుటుంబ వివరాలను తెలుసుకున్నారు. గత ఏడాది 500 మంది పిల్లలను పాఠశాలలో చేర్పి చదువు చెప్పించామని, ఈ సంవత్సరం మరిన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.పాఠశాలకు వచ్చే పిల్లలందరికీ మధ్యాహ్న భోజనం, పోషకాహారం అందిస్తామని, ప్రత్యేక మెడికల్ క్యాంపుల ద్వారా వారి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటుక బట్టీల యజమానులతో మాట్లాడి పాఠశాల వరకు రవాణా సదుపాయం కల్పించాలని సూచించారు.వివిధ రాష్ట్రాల నుండి వచ్చే పిల్లలకు ఇంగ్లీషులో బోధన చేయాలని, ముఖ్యంగా గణితం, ఇంగ్లీషు సబ్జెక్టులను ప్రాధాన్యంగా బోధించాలని విద్యా వాలంటీర్లను ఆదేశించారు. యూనిఫాం, పుస్తకాలు, నోట్‌బుక్కులు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**పూర్వ ప్రాథమిక పాఠశాల సందర్శన**

గట్టుభూత్కూరు మండల ప్రాథమిక పాఠశాలలోని పూర్వ ప్రాథమిక విభాగాన్ని కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని, ప్రభుత్వం పంపిన ఆట వస్తువులు, పుస్తకాలను వినియోగించాలని సూచించారు. విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రజిత, మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రష్యా డ్రోన్ తయారీ కేంద్రంపై 226 కేజీల బాంబు వదిలిన ఉక్రెయిన్..



**కీవ్ - డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రష్యాలోని డ్రోన్ తయారీ కేంద్రంపై ఉక్రెయిన్ బాంబు దాడి చేసింది. వోవ్‌చాన్స్క్ లో ఉన్న డ్రోన్ కంట్రోల్ అండ్ కమ్యూనికేషన్ హబ్‌ను పేల్చివేసింది. ఉక్రెయిన్ వైమానిక దళానికి చెందిన సుఖోయ్-27 ఫైటర్ జెట్.. సుమారు 226 కిలోల బాంబును జారవిడిచింది. ఆ దాడికి చెందిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. డ్రోన్ సెంటర్‌లో ఉన్న ఓ బిల్డింగ్‌పై సుఖోయ్ యుద్ధ విమానం బాంబును వేసింది. టార్గెట్‌ను చేరుకోగానే.. చాలా శక్తివంతమైన పేలుడు జరిగింది. దీంతో దట్టమైన పొగ వ్యాపించింది.అటాక్ కోసం జీబీయూ-62 బాంబును వాడారు. జేడీఏఎం-ఈఆర్ కిట్‌ను కూడా ఆ అటాక్ కోసం వినియోగించారు. జీబీయూ-62 సుమారు 500 పౌండ్ల బరువున్న బాంబు. ఎంకే-82 ప్రమాణాల ప్రకారం దాన్ని నిర్మించారు. జేడీఏఎం జీపీఎస్ గైడెన్స్ సిస్టమ్ ద్వారా దీన్ని అప్‌గ్రేడ్ చేశారు. శాటిలైట్, ఇంటర్నల్ నావిగేషన్ ద్వారా ఈ బాంబు టార్గెట్‌ను చేరుకుంటుంది. ఈఆర్ గ్లైడ్ మాడ్యూల్.. ఆ బాంబును టార్గెట్ వరకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుంది. అంటే యుద్ధ విమానం టార్గెట్ సమీపం వరకు వెళ్లవలసిన అవసరం లేకుండానే బాంబును పేల్చవచ్చు.

# అసోంలో రోడ్డెక్కిన 108 ఉద్యోగులు



**న్యూఢిల్లీ డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీజేపీపాలిత రాష్ట్రం అసోంలో 108 ఉద్యోగులు రోడ్డెక్కారు. అర్ధనగ్న ప్రదర్శనలతో ప్లకార్డులు చేతబూని అంబులెన్స్ డ్రైవర్లు, సాంకేతిక నిపుణులతో కూడిన ఆల్ అస్సాం 108 మృత్యుంజయ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించింది. ఉద్యోగ భద్రతతో ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రోజుకు 12 గంటల పని భారంతో అలసిపోతున్నామని, కానీ 10 గంటల పని చేస్తున్నట్లు రికార్డులోకి నమోదు జీతం తక్కువగా ఇస్తున్నారని 108 ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు ప్రాంజల్ శర్మ అన్నారు. ఎలాంటి సెలవులు లేకుండా అత్యవసర సేవలు అందిస్తున్నామని తెలియాజేశారు. "మేము రోజుకు 12 గంటలు పని చేస్తాము కానీ 10 గంటలు మాత్రమే జీతం పొందుతాము. సెలవు దినాల్లో లేదా అత్యవసర సమయాల్లో కూడా మేము విధుల్లో ఉంటాము. మాకు అందించిన కొద్దిపాటి వేతన అంచనాను మేము తిరస్కరించాము' అని ఆందోళనకారులు మీడియాతో ఆవేదన వ్యక్తం చేశారు.

# వెల్దండలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మట్ట యాదమ్మ గడపగడప ప్రచారం





**వెల్దండ, డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సర్పంచ్ అభ్యర్థి మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ గురువారం గడపగడప ప్రచారాన్ని కొనసాగించారు.ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అభ్యర్థి మట్ట యాదమ్మ తన గుర్తు కత్తెరను చూపిస్తూ మహిళలు, వృద్ధులను కలుసుకుని ముమ్మరంగా ప్రచారం చేశారు.ఈ సందర్భంగా మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో వెల్దండ మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ సర్పంచ్ రెడ్డి భూపతిరెడ్డి, వెల్దండ సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, వెల్దండ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్ర శీను, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభల అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, వెల్దండ మండల యూత్ అధ్యక్షుడు మట్ట భరత్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమేష్, ఎండి రషీద్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలో మన కరెన్సీకి విలువ లేదు : ఖర్గే



**న్యూఢిల్లీ - డిసెంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రూపాయి విలువ దిగజారింది. డాలర్‌తో పోలిస్తే మన రూపాయి విలువ 90కి పడిపోయింది. గురువారం ఉదయం ఆల్ టైమ్ కనిష్టస్థాయి 90.43కి చేరింది. ఈ నేపథ్యంలో కేంద్రం అవలంబిస్తున్న ఆర్థిక విధానాల వల్లే రూపాయి పతనమవుతుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. గురువారం ఆయన పార్లమెంటు వెలుపల ఈ విషయంపై మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర అవలంబిస్తున్న విధానాల వల్లే రూపాయి పతనమైంది. భారత కరెన్సీకి ప్రపంచంలో విలువ లేదు. వారి విధానాల వల్లే రూపాయి బలహీనపడుతోంది. వారి విధానం బాగుంటే రూపాయి విలువ పెరిగి ఉండేది. రూపాయి పతనం.. మన ఆర్థిక వ్యవస్థ బాగోలేదని చూపిస్తుంది. మనం ఏది కావాలంటే అది చెప్పగలం. మనల్ని మనం అభినందించుకోవచ్చు. కానీ మన కరెన్సీకి ప్రపంచంలో విలువ లేదని చూపిస్తుంది' అని ఆయన అన్నారు.